# పెళ్ళి ప్రయాణం

సోమయాజులు యెస్టేటులో ఒక చిన్న వుద్యోగి. రమారమి పన్నెండు సంవత్సరాలు అవుతుంది విజయనగరంలో కాపురం పెట్టి. యీ రోజులలో వందలకు వందలు జీతాలు తెస్తూవున్న వారికే కుటుంబ పోషణం యెంతో కష్టంగా వుంటుంది. అటువంటిది యెస్టేటులో చిన్న వుద్యోగం చేస్తూ నెలకు యాభైరూపాయిల జీతం తెచ్చే సోమయాజులుకి కుటుంబపోషణ కష్టంగా వుందనడంలో ఆశ్చర్యమేముంది? తను, భార్యా, ముగ్గురు ఆడపిల్లలు యిదే అతని కుటుంబం. చూచినవాళ్లకి చిన్నదిగానే వుంటుంది. కాని వాళ్లని పోషించుకుని వచ్చేసరికి తాతలు దిగివస్తారు. గొడ్డాలికి యేమితెలుసు బిడ్డల పెంపకం అని యేకాకిగా తిరిగేసి వూరుమీద బ్రతికే వాళ్ళకి కుటుంబభారం యేం తెలుస్తుంది! పాపం! సోమయాజులు యేంచేస్తాడు! ఆఫీసు వదిలేక సాయంత్రంపూట పదిమంది గుంటలనిచేరదీసి ప్రయివేట్లు చెప్పుకుంటూ మరో ముప్పయ్యో నలభయ్యో సంపాదించుకుని ఆ కుటుంబాన్ని యీడుకు వస్తున్నాడు. భార్యా చంద్రమ్మ చూడబోతే వుత్తిచాదస్తపు మనిషి. రెండువందలయాభై సంవత్సరాల క్రిందట వుండవలసిందిగాని, ప్రస్తుత నవనాగరికత ప్రపంచంలో పుట్టవలసిన మనిషిగాదు. అయితే అటువంటి మహాపతివ్రతలు యేకొద్దిమందో యింకా భూమిమీద వుండబట్టే మనభారతదేశం యెన్ని కష్టాలపాలైన కూడుగుడ్డలకి లోటులేకుండా వుందని కొందరు వేదాంతులు అంటారు. అదెలాగవున్నా, ఆవిడచాదస్తమో, ఆ బ్రాహ్మడి దౌర్భాగ్యమోగాని తాతలు నాటి పద్ధతులు అన్నీ ఆవిడని వేదించుకు తింటున్నాయి. ఆమెను బాధిస్తున్న సమస్యలలో ముఖ్యమైనది పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యలేదని.

ఆ రోజు ఆదివారం శెలవు అవటంచేత కాస్త వేగిరంగానే యింటికి వచ్చేసాడు సోమయాజులు.

"యేమండీ! వారంకి ఒక్క రోజుకదా మనం తీరుబాటుగా మాట్లాడుకోవడం. తక్కిన ఆరురోజులు మీకు నాతో ఒక్కసారి అయినా ముచ్చటించడానికి తీరుబాటు వుండదాయె. యే ఆఫీసో, యేంవుద్యోగాలోను!" అంది చిన్నగా నవ్వుతూ చంద్రమ్మ.

"అవును చంద్రా! యెలాగ చెప్పు? యింతరాత్రి పగలూ కష్టపడ్డా ఆ కూలి

డబ్బులయినా కిట్టుబాటు కావడంలేదు. నెలఅయేసరికి పిల్లలకి బడిజీతాలు కట్టాలా! యింట్లో కర్చులు మామూలే. డబ్బు లేదని నోరు కట్టుకోగలమా! యేకర్చు మానేగలం! యీరోజుల్లో నెలకి ఒక శతకమేనా సంపాదించలేకపోతే కుటుంబాన్ని పోషించడం మాహాకష్టం" అన్నాడు వాలు కుర్చీలో చేరబడుతూ యాజులు.

"ఇదుగో చూడండి! ఆడపిల్లలకి చదువులెందుకు చెప్పండి? యేదో చాకలిపద్దు రాసుకోవడానికి నాలుగు అక్షరంముక్కలు చెప్పించేరు సరిపోయె. యింట్లో యెక్కడ లేని డబ్బూ మనతిండికే చాలకుండావుంటే వాళ్ళకి చదువులుకూడా యెందుకు. ఆడపిల్ల యెప్పుడేనా అత్తవారింటికి పోవలసిందేకదా! యీ ఇంగ్లీషు చదువులు చదువుకొని వుద్యోగాలు చెయ్యాలా? వూళ్ళు యేలాలా? పెద్దపిల్ల స్కూల్ ఫైనల్ ప్యాసు అయిందికదా! యింక నా మాటవిని ఆ కాలేజీ చదువులు మాన్పించేయండి"

"అబ్బబ్బా! అదేమిటే అలాగ అంటావు? పిల్ల చదువుకుంటూవుంటే మాన్పించమంటావేమిటే! మనకి మొగపిల్లలు లేరు. కూతురైనా కొడుకైనా అదేకదా! బి. ఎ. ప్యాసు అయిందంటే అదే యేదైనా వుద్యోగంచేసి మనల్ని పోషిస్తుంది. నేను యింక రెండు సంవత్సరాలలో రిటయిర్ అయిపోతున్నాను. మనకి వేరేదిక్కు యేమిటుంది చెప్పు చంద్రా!"

"అయ్యో అయ్యో! నాకర్మంకాలా! ఆడగుంట వుద్యోగం చెయ్యడం మనల్ని పోషించడమునా! గట్టిగా అనకండి యెవరైనావింటే నవ్వుతారు. యిప్పటికే నలుగురూ ఛీ అంటున్నారు. రెండు సంవత్సరాలు అయింది పిల్ల పెద్దమనిషి అయి. రెండోపిల్లకూడా రేపోమాపో పెద్దమనిషి



నవయుగ వారి "జ్యోతి"లో సావిత్రి

కావడానికి సిద్ధంగావుంది. యింకా పెళ్ళిళ్ళు చెయ్యకపోతే నలుగురూ ఆడిపోయ్యారండి! యిప్పటికే చూసిన వాళ్ళంతా, యెప్పుడే చంద్రమ్మా! మీ పిల్లకి పెళ్ళి? మాకు బూరెముక్క యెప్పుడు పెడతావో! అంటూ నన్ను యెత్తిపొడుపు మాటలలో పొడుచుకుతింటున్నారు. అదేం చదువులో యేమిటో! పిల్లవాటంచూస్తే నాకేం బోధపడ్డంలేదు. రాత్రిపగలూ చదువుకోవడాకని క్లాసుపిల్ల లింటికి వెళ్ళిపోతూ వుంటుంది. యింట్లో నామాట బొత్తిగా వినడం మానేసిందికదా! మనవీధిలో పశువుల డాక్టరు ఒకడు దిగేడుకదా క్రొత్తగా. వాళ్ళ అమ్మాయిలుకూడా తన క్లాసే చదువుతున్నారట. ఇరవైనాలుగు గంటలూ వాళ్ళతోటే తిరుగుతూ వుంటుంది. మా చిన్నప్పుడు మేంకూడా చదువుకున్నాము కాని యిలాంటి రావిబాటు యెరక్కపోయాం. మొన్న వెంకమ్మ అత్తగారాయి దగ్గర అంది యంటే, వూరికేనే అనలేదు. మన అనువుకనిబెట్టే నాలుగు మాటలు ఆడిపోయింది. 'ఆ డాక్టరు మంచివాడు కాడుట. మన అమ్మాయి వాళ్ళ యింటికి వెళ్తే యెంతో అభిమానం వున్నట్టుగా నటిస్తూ యెత్తేసుకుని ఒళ్ళో కూర్చొబెట్టుకుని ముద్దులు పెట్టేసుకుంటున్నాడు. నేను కళ్ళార చూచేను అని చెప్పింది వెంకమ్మ. పెద్దమనిషికదా వాడికేం పోయేకాలం చెప్పండి? మళ్ళీ డాక్టరుట, ముండా డాక్టరు. యింతకీ మన అమ్మాయికి బుద్ధి వుండక్కర్లే. వాళ్ళ గుమ్మంలోకి యెన్నిసార్లు వెళ్ళవద్దన్నా యెప్పుడూ అక్కడే పడిచస్తుంది. ఇదంతా మీనుంచే వచ్చింది. మీరే దానికి కొమ్ములు తీసుకొని వచ్చేరు. యికనైనా కళ్లు తెరుచుకొని పిల్లకి పెళ్ళి చెయ్యండి.'

'నీతో గట్టిచిక్కు వచ్చిందే అడివి మొద్దా! యిప్పటికిప్పుడు పెళ్లి యెలాగ అయిపోతుందో నువ్వేచెప్పు చంద్రా! పెళ్లి అంటే యెంతడబ్బు వుండాలి! ఆ



రోహిణి వారి "ప్రతిజ్ఞ"లో సావిత్రి

డబ్బులేకనే కదా పిల్లన్ని చదువులో పెట్టింది. ఇంతకీ మనపిల్లకి పెళ్ళిచేసుకోడం యిష్టంవుందో లేదో! దాన్ని ఒకసారి అడిగిచూచావా"

"అయ్యో .నాయిల్లు బంగారంగాను! దాన్ని అడగడం యేమిటండీ! పెళ్లి అంటే యెవరికి అక్కర్లేదు. చస్తూవున్న ముసలాడుకూడా పెళ్లిచేసుకుంటావా తాతా అంటే పిల్ల బాగుంటుందా అబ్బీ! అంటాడు కదా! నిక్షేపంలాంటి పిల్ల పెళ్లిచేసుకోక పోవడం యేమిటండీ! మీ మొగాళ్లకి యేమీ తెలీదు! పాపం దాని మనస్సులో యెంత బాధవుందో! యిదుగో చూడండి! విశాఖపట్నంలోను మంచి సంబంధంవుందిట. మొన్న మాఅమ్మ వుత్తరంలో రాసింది. పేరీవెంకన్నపంతులు కొడుకట, సుబ్బారావు; హార్బరులో పని చేస్తున్నాడు. నూరురూపాయిలు జీతం తెస్తున్నాడుట. కట్నాలు, కానుకలు యేమీఅక్కర్లేదు. పిల్ల అందంగావుండి చదువుకున్నదై తేచాలు. ఒకసారి మీరు వెళ్లి భోగట్టాచెయ్యండి అని వ్రాసింది. రేపు ఏకాదశి సోమవారం చాలా మంచి రోజు. మీరు ఒకసారి విశాఖపట్నం వెళ్లి ఆసంబంధం యేదో చూసుకురండి! రేపు ఓ పూట ఆఫీసుకి శెలవు పెట్టండి. కార్యాలు కథలు అంటే ఆఫీసుక్కి శెలవు యివ్వరా యేమిటి?"

"అబ్బా! గట్టిచిక్కే వచ్చిందే నీతోటి! నువ్వు అన్నట్టూ అయిపోవాలి. సరే రేపు పొద్దంట బండికి వెళ్తున్నాను. నా సంచీలో రెండు చొక్కాలు, రెండు పంచెలు కుక్కు."

♦ ♦ ♦

"చంద్రమ్మక్కా! చంద్రమ్మక్కా! తియ్యవే!"

"యెవరది!"

"నేనే! బుచ్చన్నని."

"ఆ! ఆ! వస్తున్నా అన్నాయ్యా! ..."

చేతులోని అన్నపు గిన్నె తిన్నెమీద పెట్టి గబగబావచ్చి తలుపు తీసింది చంద్రమ్మ.

"యెక్కడినుంచి రావడం బుచ్చి అన్నయ్యా!"

"ఆ! .... యీ వూళ్లో యివ్వాళ కోర్టు పనివుంటేను బరంపురంనుంచి వస్తున్నాను."

"నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి చంద్రమ్మా! నీ మొగుడు నీతోటి తప్పకుండా చెప్పమన్నాడు."

"యేమిటన్నయ్యా అది త్వరగా చెప్పు!"

"మరేమీ లేదు. నిన్నను నువ్వు నీ భర్త తగువులాడుకున్నారుటగా! యీ కరువురోజుల్లో కుటుంబాన్నే పోషించడం

మహాకష్టంగావుంటే పిల్లలకి పెళ్ళిళ్ళుకూడా యెక్కడ చెయ్యగలడు. యింట్లో నీ బాధ పడలేక ఆర్థిక చిక్కులతో అలమటిస్తూ మనస్తాపంతోటి కాశీకిపోయినాడు. కొన్ని రోజులపాటు తీర్థయాత్రలు చేసివస్తే కాస్త మనస్సు స్తిమితంగా వుంటుందేమోనని. నిన్ను మరేమీ బెంగపెట్టుకోవద్దు, కొన్ని రోజులు పుణ్యక్షేత్రాలు తిరిగి మళ్ళా వస్తాను అని చెప్పమన్నాడు, అంతే. నేను కోర్టుకుపోయి వస్తాను" అని చెప్పి చల్లగా జారుకున్నాడు బుచ్చన్న.

"ఒసే! లలితా! లలితా! యెక్కడ వున్నావే!"

"వస్తున్నా అమ్మా! ... యెందుకూ!"

"మీనాన్న కాశీపోయినాడుటే! కాశీలో యేముందే నాపిండం! మనందర్నీ యే గంగలో కలిసిపోమన్నారో! చావుకబురు చల్లగా చెప్పిపోయేడు బుచ్చన్న. యిప్పుడు యేంచేస్తామే లలితా!"

"అమ్మా! యిప్పుడు నువ్వేమీ విచారించకు. నాన్న మొదట నీతో చెప్తే విన్నావా! యెప్పటికైనా అదేమనకి దిక్కు, దాన్ని చదువుకోనీ, అని లక్షసార్లు నెత్తి మొత్తుకొని చెప్పేరు. మొగాడిని యింట్లో కాల్చుకు తినేస్తే, యెంతకని భరించగలడు! నీ బాధపడలేక యెక్కడికో పోయేరు, మరేమీ ఫరవాలేదులే. యీ వూర్లో కొత్తగా సర్వే ఆఫీసు పెట్టేరుకదూ! అందులో అందరికీ వుద్యోగాలు యిస్తున్నారుట. నేనుకూడా అక్కడికిపోయి ఓ చిన్న వుద్యోగం యిమ్మని అడుగుతాను. నువ్వేమీ బెంగపెట్టుకోకు."

"అలాగేనే నాతల్లీ! నువ్వే యింక యిల్లు నిలబడపెట్టాలి."

ఎన్. కామేశ్వరరావు

పాతురిడు గారి

# బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు—4. Phone 85254.

కుంభకోణము బ్రాంచి : 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి : 15 పుగళియపిళ్లెవీధి, తెప్పకుళం. P. O.

అన్ని మందుల షాపులలోను దొరకును.